www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229




సంపుటి : 17 | సంచిక : 222 | బుధవారం 14.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# చైనా కంటే మనమే బెటర్

## భారత్ ఆర్థిక వృద్ధిరేటు 7 శాతం

సాంకేతిక ఫలాలు అందరికీ చేరాలి
ప్రజల సాధికారతే సాంకేతిక ప్రగతి లక్ష్యం

- ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ కీలక భాగస్వామి
- వికసిత భారత్ దిశగా సాంకేతిక విప్లవం
- పోటీ కంటే సహకారానికే ప్రాధాన్యం ఇవ్వాలి 02
- భారత్‌లో బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్
- ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా భారత్
- సంపద, విజ్ఞానం ప్రజల మేలు కోసమే
- 500 మందికి పైగా ప్రముఖులతో అంతర్జాతీయ సదస్సు



ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో జరిగిన 8వ బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడుతూ, సాంకేతిక అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని అన్నారు. డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్‌చేంజర్‌గా నిలుస్తాయని, ప్రజల సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. భారత్ 7 శాతం ఆర్థిక వృద్ధిరేటుతో ప్రపంచ పెట్టుబడులకు నమ్మకమైన గమ్యస్థానంగా ఎదుగుతోందని తెలిపారు.

# డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం..



## మూడు ఆర్‌ఓడీబీలకు సేతు బంధన్ పథకంలో ఆమోదం

- 34 రహదారి పనులకు నిధుల కోసం మంత్రి విజ్ఞప్తి
- పర్వతమాల పథకంలో తెలంగాణకు ఐదు రోప్‌వేలు
- హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్.. గడ్కరీకి ఆహ్వానం
- తెలంగాణ మౌలిక వసతుల ప్రాజెక్టులపై ఢిల్లీలో చర్చలు
- కొత్త రహదారులతో రవాణా, పర్యాటక రంగాలకు ఊతం
- హైవేల ప్రతిపాదనలపై కేంద్రానికి కోమటిరెడ్డి వినతి 03

# భారత్‌కు అరుదైన గౌరవం..



- ఐరాస ఆయుధ నియంత్రణ బోర్డుకు భారతీయుడి నేతృత్వం
- యూఎన్ కీలక పదవికి డీబీ వెంకటేష్ వర్మ ఎంపిక 02

# రెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు

# 77 మంది ఇంఛార్జ్‌లు

## ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని సీఎం ఆదేశం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంతో పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, నల్గొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కలిపి మొత్తం 77 మంది ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇందులో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి 43...

- పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి
- ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని సీఎం ఆదేశం
- రెండు స్థానాల్లో విజయం సాధించాలని కాంగ్రెస్ కసరత్తు
- మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎన్నికల బాధ్యతలు
- హైదరాబాద్ స్థానం కోసం 43 మంది ఇన్‌చార్జ్‌లు
- నల్గొండ స్థానానికి 34 మంది బాధ్యుల నియామకం
- గ్రాడ్యుయేట్ ఎన్నికలపై ఢిల్లీలో సీఎం సమీక్ష
- క్షేత్రస్థాయి ప్రచారంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి 03

# ప్రభుత్వం కీలక నిర్ణయం

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి..



- జగిత్యాల వాసి సుదర్శన్ మృతదేహం తెచ్చేందుకు ప్రభుత్వ సాయం
- సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు 03
- కామారెడ్డి వాసి అఫ్జల్ ఖాన్ మృతిపై కుటుంబంలో ఆందోళన
- విదేశాంగ శాఖ జోక్యంతో స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి



రూ.1,754 కోట్ల లాభాలు.. కార్మికులకు బోనస్

సింగరేణి కార్మికులకు రూ.1.51 లక్షల దసరా బోనస్
15 రోజుల్లో 300 కారుణ్య నియామకాలు పూర్తి

# కార్మికులకు 34 శాతం వాటా

కారుణ్య నియామకాలపై సింగరేణి యాజమాన్యం హామీ

- దసరా పండుగకు సింగరేణి కార్మికులకు భారీ కానుక
- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ ప్రకటన
- సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా
- డిపెండెంట్ అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలు
- కార్మికుల కోసం ఆధునిక గృహ నిర్మాణానికి ప్రణాళిక
- కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణి చర్యలు
- కారుణ్య నియామకాలపై సింగరేణి యాజమాన్యం హామీ
- కార్మికుల సంక్షేమానికి పలు కీలక నిర్ణయాలు 02

# ఎన్నికల సంఘం ఎలా బాధ్యత వహిస్తుంది?

## దేశం సోనియా కుటుంబం ప్రైవేట్ ఆస్తి కాదు

కాంగ్రెస్ ఓటములకు ఈసీ ఎలా బాధ్యత వహిస్తుంది?

- దేశ భవిష్యత్తుకు కాంగ్రెస్ వైఖరి ప్రమాదకరం: కిషన్‌రెడ్డి
- ఎన్నికల సంఘాన్ని నిందించడం తగదు
- కాంగ్రెస్ రాజకీయాలపై కేంద్ర మంత్రి తీవ్ర విమర్శలు
- చనిపోయిన వారి ఓట్లు తొలగించాల్సిందే
- రాజ్యాంగ సంస్థలపై ఒత్తిడి తేవడం సరికాదు 05





# డీఎస్సీ-2008 అభ్యర్థులకు హైకోర్టు షాక్..

## జీవో 28పై బీఈడీ అభ్యర్థులకు నిరాశ

- జీవో 28పై బీఈడీ అభ్యర్థులకు నిరాశ
- డీఎస్సీ 2008 నిబంధనలపై హైకోర్టు కీలక తీర్పు
- ఎంపిక నిబంధనల్లో మార్పులపై పిటిషన్లు డిస్మిస్
- ఎస్‌జీటీ పోస్టుల కేటాయింపుపై న్యాయస్థానం స్పష్టత 05

# గురుకులాల్లో పీఎంయూ టెండర్లను రద్దు చేయాలి

టెండర్ల నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమం

జిల్లా స్థాయిలో కొనుగోళ్లు చేపట్టాలని సూచన
టెండర్ల నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమం
జిల్లా స్థాయిలో కొనుగోళ్లు చేపట్టాలని సూచన
నాలుగు వేల హాస్టళ్లకు సరుకుల కొరత

- గురుకులాల పీఎంయూ టెండర్లు రద్దు చేయాలి: హరీశ్‌రావు
- స్థానిక వెండర్లకే సరుకుల సరఫరా బాధ్యతలు ఇవ్వాలి
- గురుకులాల టెండర్లలో భారీ కమీషన్లు: బీఆర్ఎస్ ఆరోపణ
- రూ.800 కోట్ల టెండర్లపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు 03
- వేలాది చిరు వ్యాపారుల ఉపాధికి గండికొడుతున్నారని ఆరోపణ
- గురుకులాలకు సరుకుల సరఫరాలో ప్రభుత్వంపై విమర్శలు



# ప్రభుత్వానికి 10 రోజుల డెడ్‌లైన్.!

- మంత్రి హామీతో తాత్కాలికంగా ఆందోళనకు విరామం
- మౌలిక సదుపాయాల కొరతతో వైద్య సేవలకు ఇబ్బందులు
- గతంలోనే నోటీసు ఇచ్చినా పరిష్కారం కాలేదంటున్న జూడాలు 05
- పది రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ సమ్మె




## ఉస్మానియా ఆస్పత్రిలో జూడాల ధర్నాకు తాత్కాలిక విరామం?

హామీతో వెనక్కి తగ్గుతారా.. సమ్మె కొనసాగిస్తారా?

# చైనా కంటే మనమే బెటర్

**న్యూఢిల్లీ :** సాంకేతిక అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సాంకేతిక పురోగతి, సమాచారం, విజ్ఞానం, వినూత్న ఆలోచనల ఫలితాలు కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా కోట్లాది మంది ప్రజల సాధికారతకు ఉపయోగపడాలని అన్నారు. అధికారం ఎవరి చేతుల్లో ఉందన్నది ముఖ్యం కాదని, దాన్ని ప్రజల అభ్యున్నతికి ఎలా ఉపయోగిస్తున్నామన్నదే కీలకమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో తొలిసారిగా నిర్వహిస్తున్న 8వ 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో ఇవాళ పాల్గొన్న ఆయన.. 'పవర్ టు ఎంపవర్' అనే దూరదృష్టితో తాము ముందుకుసాగుతున్నామని చెప్పారు. డిజిటల్ నైపుణ్యాలు భారత్ కు గేమ్ చేంజర్‌గా నిలుస్తాయన్నారు.

**సరైన సమయంలో.. సరైన వేదిక**

ప్రతి ఏటా ఎకానమీ, ఎనర్జీ వంటి అంశాలపై చర్చించే ఈ ప్రతిష్టాత్మక ఫోరమ్‌ను తొలిసారిగా భారతదేశంలో నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఫోరమ్ వ్యవస్థాపకుడు మైఖేల్ బ్లూమ్‌బెర్గ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. సరైన సమయంలో, సరైన ప్రదేశాన్ని (భారతదేశాన్ని) ఎంచుకున్నారు అని ప్రశంసించారు. ఆలోచనా విధానంలో రావాల్సిన మార్పులను ప్రధాని వివరించారు. కేవలం అధికారాన్ని చెలాయించడం కంటే ప్రజలను సాధికారత వైపు నడిపించడం ముఖ్యం అని ఒకరితో ఒకరు పోటీపడే శక్తి కంటే పరస్పరం సహకరించుకునే ధోరణి పెరగాలన్నారు. మన సొంత విజయాల కంటే ఇతరులు విజయం సాధించడంలో సహాయపడే దిశగా ఆలోచించాలని జ్ఞానం, సంపద, అధికారం ఎవరి వద్ద ఉన్నాయనేది కాదు.. వాటిని ఏ ఉద్దేశంతో ఉపయోగిస్తున్నారనేదే ముఖ్యం అని స్పష్టం చేశారు.

**చైనాకంటే మెరుగ్గా ఉన్నాం:**

భారతదేశం ప్రస్తుతం ఒక చారిత్రక ఘట్టంలో ఉందని, వికసిత్ భారత్ సాధనలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నమ్మకమైన గ్రోత్ ఇంజిన్‌గా ఎదుగుతోందని మోడీ అన్నారు. భారత్ కేవలం పెట్టుబడులకు గమ్యస్థానమే కాకుండా, ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దే నమ్మకమైన భాగస్వామిగా మారిందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం భారత దేశమేనని భారత ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని మన దేశ ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని స్పష్టం చేశారు. కాగా 'ఎ వరల్డ్ ఇన్ ప్లే: డిఫైనింగ్ ది న్యూ లీవర్స్ ఆఫ్ పవర్' థీమ్‌తో జరుగుతున్న ఈ 8వ బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన ప్రముఖ నాయకులు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నారు. మారుతున్న భూ రాజకీయాలు, ఆర్థిక సవాళ్లు, భవిష్యత్ ప్రగతికి సంబంధించిన అంశాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించనున్నారు.



## దూసుకొస్తున్న ఈశాన్య రుతుపవనాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల వైపు ఈశాన్య రుతుపవనాలు వేగంగా దూసుకు వస్తున్నాయి. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో వర్షాల తీవ్రత గణనీయంగా పెరగనుందని వెదర్ మ్యాన్ తెలిపారు. ముఖ్యంగా అక్టోబర్ 15వ తేదీ నుంచి కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు దంచికొట్టే అవకాశమున్నట్లు తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. బంగాళాఖాతంలో ఏర్పడే వాతావరణ మార్పులు, తేమతో కూడిన గాలుల తీవ్రత వల్ల ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరప్రాంత ప్రజలు, ముఖ్యంగా రైతులు ఈ వర్ష సూచనను గమనించి వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలోనూ వర్షాల ప్రభావం క్రమంగా పెరగనుంది. అక్టోబర్ 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు విస్తరించే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు తెలిపారు. దక్షిణ, తూర్పు తెలంగాణ పరిధిలోని జిల్లాలతో పాటు మధ్య తెలంగాణ ప్రాంతాల్లోనూ అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం, రాత్రిపూట స్వల్ప చలి గాలులు కొనసాగినప్పటికీ, 17వ తేదీ తర్వాత ఆకాశం మేఘావృతమై ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఈశాన్య రుతుపవనాల రాకతో సీజనల్ మార్పులు చోటుచేసుకుంటున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# కార్మికులకు 34 శాతం వాటా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి కార్మికులకు దసరా బోనస్‌పై కీలక ప్రకటన వెలువడింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా కార్మికులకు బోనస్ ప్రకటించింది. సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు బోనస్‌గా కేటాయించింది. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.1,51,912 బోనస్‌గా అందనుంది. కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున బోనస్ ఇవ్వనుంది

**రూ.1,754 కోట్ల లాభాలు.. కార్మికులకు 34 శాతం వాటా**

సింగరేణి సంస్థ మొత్తం రూ.1,754 కోట్ల లాభాలను ఆర్జించింది. ఇందులో 34 శాతం వాటాను కార్మికులకు బోనస్‌గా కేటాయించనున్నారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు దసరా పండుగ సందర్భంగా ఈ బోనస్ అందించనున్నారు. సింగరేణి కార్మికులకు సంబంధించి పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డిపెండెంట్ అభ్యర్థులకు త్వరలోనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. కారుణ్య నియామక ప్రక్రియను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 300 మంది కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో విధులకు హాజరుకాని కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమంలో భాగంగా హౌసింగ్ కాలనీల నిర్మాణంపై దృష్టి సారించనున్నారు. మైనింగ్ కార్యకలాపాలు లేని ప్రాంతాల్లోనూ కాలనీలను నిర్మించాలని నిర్ణయించారు. కార్మికులకు అధునాతన సౌకర్యాలతో కూడిన ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. సింగరేణిలో మారు పేర్ల సమస్యను కూడా పరిష్కరించనున్నారు. దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా దసరా బోనస్‌తో పాటు కారుణ్య నియామకాలు, పెండింగ్ ఉద్యోగాలు, హౌసింగ్ కాలనీలు, ఇతర కార్మిక సమస్యల పరిష్కారంపై సింగరేణి యాజమాన్యం కీలక నిర్ణయాలు తీసుకుంది.

# భారత్‌కు అరుదైన గౌరవం..

**ఢిల్లీ :** ఐక్యరాజ్యసమితి చరిత్రలోనే అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. యుఎన్ సెక్రటరీ జనరల్స్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ డిసార్మామెంట్ మ్యాటర్స్ అధ్యక్షుడిగా ప్రముఖ భారత మాజీ దౌత్యవేత్త డీబీ వెంకటేష్ వర్మ నియమితులయ్యారు. ఐక్యరాజ్యసమితి ఆయుధ నియంత్ర బోర్డుకు ఓ భారతీయుడు అధ్యక్షత వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ క్రమంలో 2026-27 కాలానికి చైర్మన్‌గా నామినేట్ అయిన వెంకటేష్ వర్మ న్యూయార్క్‌లోని యుఎన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన బోర్డు సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు.

**1978 నుంచి సుదీర్ఘ చరిత్ర..**

1978లో ఏర్పాటు చేయబడిన అడ్వైజరీ బోర్డులో భారత్ గత పదేళ్లుగా కేవలం ఓ సభ్య దేశంగా కొనసాగుతున్నప్పటికీ, చైర్మన్ పదవి ఓ భారతీయుడికి దక్కడం ఇదే మొదటిసారి. ఈ బోర్డులో మొత్తం 15 మంది ప్రతిష్టాత్మక సభ్యులు ఉంటారు. ఇది ఐక్యరాజ్యసమితి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిసార్మామెంట్ రీసెర్చ్ కు బోర్డ్ ఆఫ్ ట్రస్టీగా వ్యవహరించడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఆయుధ నియంత్రణ, భద్రతా అంశాలపై యుఎన్ సెక్రటరీ జనరల్‌కు కీలక సలహాలు ఇస్తుంది. ప్రస్తుతం ఈ బోర్డు పారదర్శకత, విశ్వసనీయత పెంపొందించడం, డ్రోన్ల వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , సైబర్ సెక్యూరిటీ, స్పేస్ (అంతరిక్ష) సెక్యూరిటీ వంటి వాటిపై ప్రధానంగా ఫోకస్ పెట్టింది.

**ఇంతకీ ఎవరీ వెంకటేష్ వర్మ..?**

1988 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి అయిన డీబీ వెంకటేష్ వర్మకు దౌత్యరంగంలో సుదీర్ఘమైన అనుభవం ఉంది. రష్యాలో భారత రాయబారిగా 2019 నుంచి 2021 వరకు, స్పెయిన్‌లో రాయబారిగా 2017 నుంచి 2019 సేవలందించారు. జెనీవాలోని కాన్ఫరెన్స్ ఆన్ డిసార్మామెంట్‌కు భారత్ తరఫున అంబాసిడర్ పర్మనెంట్ రిప్రజెంటేటివ్‌గా వ్యవహరించారు. ప్రతిష్టాత్మక ఇండో-యుఎస్ సివిల్ న్యూక్లియర్ డీల్ చర్చల సమయంలో ప్రధాని కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం విదేశాంగ మంత్రిత్వ శాఖలో డిసార్మామెంట్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. 2011లో ఇండియా-యుఎస్ అణు ఒప్పందంలో చూపిన ప్రతిభకు గాను డీబీ వెంకటేశ్‌కు ఐఎఫ్ఎస్‌లో అత్యుత్తమ సేవలకు ఇచ్చే 'ఎస్‌కే సింగ్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్' పొందిన తొలి అధికారిగా చరిత్ర సృష్టించారు.

# ఉపాధి హామీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

రాష్ట్రంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ కు రేవంత్ సర్కార్ విజయదశమి వేళ శుభవార్త అందించింది. కొన్నేళ్లుగా వారు జరుపుతున్న పోరాటానికి ఫలితంగా, మొత్తం 3,800 మంది ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రాట్యుటీని మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఇవాళ జీవో జారీ చేసింది. అయితే, ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఉపాధి హామీ ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో ప్రతి ఉద్యోగికి కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ లభించనుంది. 10 సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న ఉద్యోగులకు దాదాపు రూ.10 లక్షల వరకు భారీ ఆర్థిక లబ్ధి చేకూరనుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల పదవీ విరమణ పొందే సమయంలో ఉద్యోగుల కుటుంబాలకు పూర్తి ఆర్థిక ధీమా లభిస్తుందని, వారి భవిష్యత్తుకు కొండంత అండగా నిలుస్తుందని ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దసరా ముందు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగులు ముఖ్యమంత్రికి, సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## సీఈసీ రాజీనామా చేయకుంటే అభిశంసన తప్పదు..!



**ఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘ ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈసీకి రాజ్యాంగపరమైన రక్షణ లేదని, ఒకవేళ ఆయన స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేయకపోతే ప్రతిపక్షాలన్నీ కలిసి అభిశంసన తీర్మానాన్ని తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఎంపీ శశిథరూర్ ఆరోపించారు. ఈ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, అక్రమంగా తొలగించిన ఓట్లను మళ్లీ పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రక్రియకు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా సమీక్షించాలని విపక్షాలు కోరుతున్నట్లు ఎంపీ శశిథరూర్ తెలిపారు. 2023 చివరిలో బీజేపీ ప్రభుత్వం ఆమోదించిన చట్టం ద్వారానే ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన మినహాయింపు లభించిందే తప్ప, వారికి ఎలాంటి రాజ్యాంగ రక్షణ లేదని కాంగ్రెస్ ఎంపీ గుర్తుచేశారు. పార్లమెంటరీ శీతాకాల సమావేశాల సమయంలో ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేసిన తర్వాతే ఈ చట్టాన్ని ఆమోదించారని విమర్శించారు. ప్రతిపక్షాల విశ్వాసాన్ని కోల్పోయిన సీఈసీ.. ప్రజాస్వామ్య కోసం నైతిక విలువలతో స్వతహాగా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రాజ్యాంగం కల్పించిన నిబంధనల ప్రకారం అభిశంసన ప్రక్రియను ఎదుర్కోవాల్సి వస్తుందని శశిథరూర్ హెచ్చరించారు.

# నువ్వు టెర్రరిస్టువి..





**అమెరికా :** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ మాజీ ప్రధాన సలహాదారు డాక్టర్ మహమ్మద్ యూనస్‌కు అమెరికాలో నిరసన సెగ తగిలింది. న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నెడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనను బంగ్లాదేశ్ ప్రవాసులు నిలదీశారు. యూనస్‌ను ఉద్దేశించి కొందరు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, 'నువ్వు టెర్రరిస్టువి.. బంగ్లాదేశ్‌లో ప్రజలను చంపావు.. ఇక్కడికి ఎందుకు వచ్చావు?' అంటూ ప్రశ్నించినట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో వైరల్‌గా మారిపోయింది..

**'గో బ్యాక్' అంటూ నినాదాలు**

పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఖతార్ ఎయిర్‌వేస్ విమానంలో దోహా నుంచి వచ్చిన యూనస్.. టెర్మినల్ 8 నుంచి బయటకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం సుమారు 3.45 గంటల సమయంలో ఆయనను కొందరు ప్రవాసులు చుట్టుముట్టి నిరసన తెలిపారు. బంగ్లాదేశ్‌లో వందలాది మంది మరణాలకు, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి యూనస్ కారణమంటూ ఆరోపణలు చేశారు. 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో యూనస్‌ను వీల్‌చైర్‌లో తిరిగి టెర్మినల్ లోపలికి తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది.. ఇక, ఈ సమయంలో యూనస్ వెంట తాత్కాలిక ప్రభుత్వంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రధాన సమన్వయకర్తగా పనిచేసిన, యూనస్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లామియా మోర్షెద్ ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది..

**యూనస్‌కు నోబెల్ బహుమతి వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్**

మరోవైపు, బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, మతపరమైన ప్రదేశాలపై దాడులు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో భారత్‌లోనూ యూనస్‌పై నిరసనలు వ్యక్తమయ్యాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో 'డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' ఆధ్వర్యంలో పలు సామాజిక సంస్థల ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. యూనస్ తాత్కాలిక ప్రభుత్వానికి సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన 2024 ఆగస్టు 8 నుంచి హిందువులు, వారి ప్రార్థనా స్థలాలపై దాడులు కొనసాగుతున్నాయని DHR కన్వీనర్ అజయ్ శ్రీవాస్తవ ఆరోపించారు. ఈ ఆరోపణలపై అంతర్జాతీయ న్యాయస్థానంలో యూనస్‌పై కేసు నమోదు చేయాలని, 2006లో ఆయనకు లభించిన నోబెల్ శాంతి బహుమతిని వెనక్కి తీసుకునే అంశాన్ని నోబెల్ కమిటీ పరిశీలించాలని డిమాండ్ చేశారు.

# రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో ఊరట



**ఢిల్లీ :**

ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి గతంలో చేసిన వ్యాఖ్యలపై నమోదైన క్రిమినల్ పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి దిగువ ట్రయల్ కోర్టులో కొనసాగుతున్న విచారణ ప్రక్రియ పై అత్యున్నత న్యాయస్థానం మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాహుల్ గాంధీ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఫిర్యాదుదారునికి నేరుగా కేసు వేసే అర్హత లేదని, ఎవరినీ వ్యక్తిగతంగా నిర్దిష్టంగా లక్ష్యం చేయలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన న్యాయస్థానం, నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, అప్పటివరకు తదుపరి విచారణను నిలిపివేస్తున్నట్లు ఆదేశించింది. రాహుల్ గాంధీ గతంలో ప్రధాని మోదీని ఉద్దేశించి "చోరోం కే సర్దార్", "కమాండర్-ఇన్-థీఫ్" అంటూ చేసిన వ్యాఖ్యలు బీజేపీ కార్యకర్తలందరికీ అవమానించినట్లేనంటూ ఓ బీజేపీ కార్యకర్త క్రిమినల్ పరువు నష్టం దావా వేశారు. అయితే ట్వీట్లలో బీజేపీ పేరును గానీ, ఏ రాజకీయ పార్టీ సభ్యుల పేర్లను గానీ నిర్దిష్టంగా ప్రస్తావించలేదని, 'బాధిత వ్యక్తి' కాకుండా మూడో వ్యక్తి పిటిషన్ వేయడం చెల్లదని రాహుల్ తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వ్యాఖ్యలు క్రిమినల్ పరువు నష్టం పరిధిలోకి వస్తాయా లేదా అన్న అంశాన్ని తాము పరిశీలిస్తామని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.. ట్రయల్ కోర్టు చర్యలకు బ్రేక్ వేయడంతో రాహుల్ గాంధీకి తక్షణ న్యాయపరమైన ఉపశమనం లభించినట్లయింది.

## కన్మన్‌కల్వ గ్రామంలో ఆర్థిక సాయం అందజేత
## ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం

**వికారాబాద్ జిల్లా/ చౌడపూర్, మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** చౌడాపూర్ కన్మన్‌కల్వ గ్రామంలో ఆర్థిక సహాయం అవసరమైన వారికి గ్రామ సర్పంచ్ లిశ్రీమతి కృష్ణవేణి రాజు గారు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం. చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా అండగా నిలవడం గొప్ప మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన వారికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన సర్పంచ్ కృష్ణవేణి రాజు గారిని అభినందించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, కష్టాల్లో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:**

PACS డైరెక్టర్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ రాము, గ్రామ ఉప సర్పంచ్ శివకుమార్,యువజన విభాగం మల్లేష్, గ్రామస్తులు రాజు, రమేష్, ఆంజనేయులు,కేశవులు, నర్సిములు తదితర గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com



# ఎన్నికల కమిషన్ క్లారిటీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు కావడానికి ఎపిక్ నంబర్ వివరాలు తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. ఎపిక్ నంబర్ వివరాలు ఇవ్వాలని పట్టభద్రులపై ఎన్నికల అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఎపిక్ నంబర్ వివరాలు అందించలేదనే ఏకైక కారణంతో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం సమర్పించిన ఫారం-18 దరఖాస్తులను తిరస్కరించకూడదని తెలిపింది. సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులు , ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ ఇటీవల విడుదలైంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాను సెప్టెంబర్‌లో ఈసీ విడుదల చేసింది. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం గతనెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు విడుదల చేసింది. ఇక, నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుంది. నవంబరు 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు స్వీకరించనుంది. డిసెంబరు 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితాను ఈసీ విడుదల చేయనుంది.

# ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు తప్పనిసరి



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న, ఇటీవల ఓటు హక్కుకు అర్హత సాధించిన గ్రాడ్యుయేట్లు అందరూ ఓటరు నమోదు చేసుకోవాలని వైరా మాజీ ఎమ్మెల్యే బి. చంద్రావతి తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 26వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత బానోతు కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. వార్డులో స్వయంగా పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదును చేయించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యం గురించి ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం కృష్ణ క్యాంపు కార్యాలయంలో నేటి వరకు జరిగిన ఓటరు నమోదు ప్రక్రియ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 25లోపు పూర్తి స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులను ప్రత్యక్షంగా కలిసి ఆఫ్‌లైన్‌లో ఓటరు నమోదు చేయించాలన్నారు. అనంతరం స్వయంగా పార్టీ ఆధ్వర్యంలోనే ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు అయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సుదూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు సైతం సమాచారం ఇచ్చి, వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కోసం ప్రత్యేక సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రాడ్యుయేట్లకు ఆమె సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు నిరంతరం పార్టీ ఆదేశాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని విజయవంతంగా అమలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నేత బానోతు జ్యోతి, బానోతు కృష్ణ, అన్వేష్‌తోపాటు స్థానిక యువకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం..

**ఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో తెలంగాణలో కీలకమైన మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తులపై స్పందించిన కేంద్రమంత్రి పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలపడమే కాకుండా, సానుకూలంగా స్పందించారు.

**సమావేశంలో లభించిన కీలక ఆమోదాలు..**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు అత్యంత కీలకమైన ఎల్బీనగర్ - హయత్ నగర్ డబల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపన ప్రతిపాదనకు ఓకే చెప్పారు. NH 167K పై ఈ బ్రిడ్జి నిర్మాణం ద్వారా తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అనుసంధానం పెరగడమే కాకుండా రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు పర్యాటక రంగం రూపురేఖలు మారనున్నాయి. హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ NH 765 పై ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి.. తక్షణమే నూతన డీపీఆర్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 'పర్వతమాల' పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 5 రోప్ వేల నిర్మాణానికి కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులను అనుసంధానించే 'హైదరాబాద్- అమరావతి' గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు. 'సేతు బంధన్' పథకం కింద 3 ఆర్వోబీ లకు ఆమోదం లభించింది. అలాగే రాష్ట్రంలో 34 పనులకు సీఆర్ఎస్ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరగా, వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర అధికారులను గడ్కరీ ఆదేశించారు. పుల్లూరు - అలంపూర్ జట్రపోలు పెంట్లవెల్లి - కొల్లాపూర్ - లింగాల- అచ్చంపేట ఉండి దేవరకొండ మల్లేపల్లి నల్గొండ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలన్న విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది.

**ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కి ఆహ్వానం..**

నవంబర్ 19 నుండి 22 వరకు హైదరాబాద్‌లో వైభవంగా జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సుకు హాజరుకావాల్సిందిగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన గడ్కరీ.. తప్పకుండా కార్యక్రమానికి వస్తానని హామీ ఇచ్చారు.

# గురుకులాల్లో పీఎంయూ టెండర్లను రద్దు చేయాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి, ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల కడుపు కొడుతూ రూ.800 కోట్ల టెండర్లలో భారీ కమీషన్ల దందా నడుపుతోందని ధ్వజమెత్తారు. గతంలో ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ సివిల్ సప్లైస్‌లో రూ.65 కోట్ల డిపాజిట్ జప్తునకు గురై బ్లాక్‌లిస్టులో ఉన్న 'నాకాఫ్' సంస్థకు ఈ కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా 12 మందికి సబ్ కాంట్రాక్టులు ఇచ్చి, జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున రూ.66 కోట్ల గుడ్‌విల్, బిల్లుల్లో ప్రతినెల 20 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టి మూడు నెలల్లోనే విఫలమై రద్దు చేసిన లోపభూయిష్టమైన విధానాన్ని తెలంగాణలో ఎవరి జేబులు నింపడానికి రుద్దుతున్నారని హరీశ్ రావు నిలదీశారు. స్థానిక వ్యాపారులు ఇచ్చే ధరల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరలకు కాంట్రాక్టు కట్టబెట్టినా, నేటికీ 4 వేల హాస్టళ్లకు సరిగ్గా సరుకులు సరఫరా చేయలేని చేతకానితనంలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి, పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణిస్తూ డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా పాత పద్ధతిలోనే స్థానిక వెండర్లకే నిత్యావసరాల సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. దీనివల్ల వేలాది చిరు వ్యాపార కుటుంబాల జీవనోపాధి దక్కడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, తాజా సరుకులు అందుతాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులు, వ్యాపారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణ దశాబ్ది వేడుకల్లో డాక్టర్, చిరుమిల్ల రాకేష్ కుమార్ టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్





**పెద్దపల్లి జిల్లా, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం దశాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హయాంలో ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పరిపాలనా సౌలభ్యం పెరిగి, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడానికి అవకాశం ఏర్పడిందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా మార్పుల్లో కొత్త జిల్లాల ఏర్పాటు కీలక అంశంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ దాసరి మమత ప్రశాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గంట రాములు, వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, దాసరి ఉషతో పాటు ప్రస్తుత కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల, గ్రామ శాఖల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు 77 మంది ఇంఛార్జ్ లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంతో పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, నల్గొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కలిపి మొత్తం 77 మంది ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇందులో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి 43 మంది, నల్గొండ-వరంగల్-ఖమ్మం స్థానానికి 34 మందికి బాధ్యతలు అప్పగించింది. ఢిల్లీలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ నేతల బాధ్యతలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

**గెలుపు బాధ్యత ఇన్‌చార్జ్‌లదే**

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించే బాధ్యతను ఇన్‌చార్జ్‌లు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలకే ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యేలు లేని ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు కేటాయించారు. కొడంగల్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అనుముల తిరుపతిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

**గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల్లో కీలకంగా మారనున్న గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టింది. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం. ఓటర్ల నమోదు ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో పాటు, నియోజకవర్గాల వారీగా సమన్వయం చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు, ప్రచార సమన్వయంపై పార్టీ దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించడం ద్వారా బాధ్యతలను స్పష్టంగా విభజించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాబోయే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే రెండు స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఎన్నికల్లో మొదటి స్థానానికే ప్రాధాన్యం ఉంటుందని, రెండో స్థానానికి అదే స్థాయి గుర్తింపు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి నేతలకు స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ నేతలు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించడంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి పెట్టింది.

# ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణకు చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. జగిత్యాల జిల్లా హసనాబాద్ గ్రామానికి చెందిన సుదర్శన్ గౌడ్ ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ సెప్టెంబర్ 1, 2026న డ్రోన్ దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య వైలాల భార్గవి ప్రజావాణి కార్యక్రమంలో తన భర్త మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. సుదర్శన్ గౌడ్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కుటుంబ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించుకునేలా సహకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కామారెడ్డి వాసి అఫ్జల్ ఖాన్ మృతిపై ఆందోళన**

ఇదిలా ఉండగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణకు చెందిన మరో వ్యక్తి మరణించి ఉండొచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన మహమ్మద్ అఫ్జల్ ఖాన్ (43) 2026 ఫిబ్రవరిలో రష్యాకు వెళ్లాడు. చమురు పరిశ్రమలో పౌర ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఆయనను మోసపూరితంగా అక్కడికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తాజాగా అఫ్జల్ ఖాన్ యుద్ధంలో మరణించినట్లు పేర్కొంటూ ఓ వాయిస్ మెసేజ్ వచ్చినట్లు వారు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలో రష్యా తరఫున పోరాడుతూ ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు ఆ సందేశంలో ఉన్నట్టు సమాచారం. అయితే, ఈ వార్తపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

**విదేశాంగ శాఖ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

అఫ్జల్ ఖాన్ కుటుంబ సభ్యులను మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నాయకుడు అంజదుల్లా ఖాన్ కలిశారు. అఫ్జల్ ఖాన్ ఆచూకీని నిర్ధారించి, కుటుంబానికి వాస్తవాలు తెలియజేయాలని ఆయన భారత విదేశాంగ శాఖతో పాటు మాస్కోలోని భారత రాయబార కార్యాలయాన్ని కోరారు. రష్యా అధికారులతో అత్యవసరంగా సంప్రదింపులు జరిపి అఫ్జల్ ఖాన్ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆయన మరణం నిజమని తేలితే, మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. తమ కుటుంబ సభ్యుడి గురించి స్పష్టమైన సమాచారం కోసం ఎదురుచూస్తున్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

# కలవరపడుతున్న దళారీలు..!




**మణుగూరు,ఫ్లాష్ ఇండియా :**

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో మణుగూరు ఓసీ విస్తరణ రానురాను జఠిలంగా మారుతుంది. ఓసీ విస్తరణ కోసం మణుగూరు మండల పరిధిలోని మణుగూరు, తిర్లాపురం, రామానుజవరం రెవెన్యూ గ్రామాల నుంచి 813 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సేకరణ జరపాలని సింగరేణి నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు భూసేకరణ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ప్రకటనతో రెచ్చిపోయిన రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా దోపిడీకి తెగబడ్డారు. భూమి హక్కులు అంటే ఏమిటో కూడా తెలియని వేలాదిమందిని పోగు చేసి, ఒక గుంట మొదలు ఎకరాల కొద్దీ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టి కోట్లు దండుకున్నారు. ప్రాంతాల వారీగా, గ్రామాల వారీగా దళారీ వ్యవస్థ ఏర్పాటు చేసుకొని నిర్వాసితుల జాబితాలో పేరు రాసేందుకు ఒక్కో వ్యక్తి వద్ద నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూళ్లు చేసి, దొంగల పేర్లతో ఎన్ అండ్ పీ నోటిఫికేషన్‌కు ఆమోదం తెలిపారు. ముందుగా వసూళ్లు చేసిన డబ్బులే కాకుండా, పబ్లికేషన్‌లో పేరు వచ్చింది, పేపర్ ఖర్చులు ఉన్నాయంటూ ఒక్కో పేరు వద్ద నుంచి రూ.30 వేలు తాజాగా వసూళ్లు చేశారు. మణుగూరుతో సంబంధం లేని, తెలంగాణ రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన వారినే కాకుండా, రాష్ట్ర సరిహద్దులు కూడా దాటి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వారికి సైతం నిర్వాసితుల జాబితాలో స్థానం కల్పించారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు.. 2013 వరకు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో సాగు చేసుకుంటూ భూములను అనుభవిస్తున్న 400 మందిని కాదని, ఇప్పటి వరకు మూడు రెవెన్యూ గ్రామాల్లో 1,506 మందిని నిర్వాసితులుగా పేర్కొంటూ జాబితాలో చోటు కల్పించారు. ఇదంతా ఒక కోణం అయితే, పక్కా పట్టాదారు పాస్‌పుస్తకం ఉండి, నేటి వరకు రైతుబంధు అందుకుంటూ భూములు సాగు చేసుకుంటున్న రైతుల భూములను ఓసీ సేకరణలో తీసుకుంటున్నట్లు ప్రకటించి, వారి పేర్లను జాబితాలో చూపించడం లేదు. పట్టాదారులు ఉన్నప్పటికీ, వారి భూముల్లో సంబంధం లేని వ్యక్తులను నిర్వాసితులుగా పేర్కొంటూ జాబితాలో స్థానం కల్పించారు. ఇదే విషయంపై నోటిఫికేషన్‌కు ముందే అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తమ భూముల్లో ఉన్న దొంగ పేర్లపై స్థానిక తహసీల్దార్‌కు చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. ఈ మొత్తం దందాలో సుమారు రూ.35 కోట్ల మేర నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది. మణుగూరు ఓసీ విస్తరణ కోసం జరుగుతున్న భూసేకరణలో భారీ దోపిడీ జరిగిందని ఆధారాలతో నిరూపించడానికి మీడియా సిద్ధంగా ఉందంటూ మాధ్యమాల్లో కథనాలు వస్తుండటాన్ని అవినీతి అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ దోపిడీలో కీలక పాత్ర పోషించిన దళారులను రెచ్చగొడుతూ, మీడియాపై కేసులు పెడతామంటూ బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా, దోపిడీలో ప్రధాన పాత్ర పోషించిన అధికారి తనకు అనుకూలంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించండి అంటూ దళారులను రెచ్చగొడుతూ, వారిని ప్రోత్సహిస్తున్న తీరు మండల పరిధి దాటి జిల్లా వ్యాప్తంగా చర్చకు తెరలేపడం ఆశ్చర్యం కలిగిస్తోంది. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్న ఈ సున్నితమైన అంశంలో కలెక్టరేట్ ముట్టడికి సిద్ధం కావాలంటూ దళారీలు ఏర్పాటు చేసుకున్న నిర్వాసితుల సోషల్ మీడియాలో సందేశాలు పోస్ట్ చేయడం వెనుక అధికారి హస్తం, ఆయన సలహాలు ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం నిజమైతే, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉండదేమో. ఏది ఏమైనప్పటికీ, ఉన్నతాధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే, దళారుల మూలంగా, దొంగ పేర్లకు ఆమోదముద్ర వేసిన అధికారి మూలంగా కచ్చితంగా మణుగూరులో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సంపాదకీయం

# పార్టీ బలోపేతానికి కీలక పరీక్ష!

దేవరకొండ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ దేవరకొండ పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్ నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు, వైద్యులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. మొదట కోర్టులోని న్యాయవాదులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ, అర్హత కలిగిన వారు నిర్ణీత నిబంధనల ప్రకారం తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై వివరించి, అర్హులైన వారు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హత కలిగిన వారు సంబంధిత నిబంధనలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై వివరాలు తెలుసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కో-కన్వీనర్ జల్దా భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, వనం పుష్పలత, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్ కుమార్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు చిలక రాజు బిక్కు, సముద్రాల సహదేవ్, గంజి హరి, ఇడం రవికుమార్, ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ విడుదలైనా వేతనాలు చెల్లించరా?

## జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల ఆవేదన



**మహబూబ్ నగర్ జిల్లా/జడ్చర్ల, (ఫ్లాష్ ఇండియా ప్రతినిధి):** బతుకమ్మ, దసరా పండుగలు వచ్చినా చేతిలో జీతం లేకుండా కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటూ జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి మెరుపు సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆసుపత్రి అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఆగస్టు వరకు వేతన బడ్జెట్ విడుదలైనప్పటికీ కార్మికులకు జీతాలు అందకపోవడం అధికారుల అలసత్వానికి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పెండింగ్ వేతనాల కోసం పలుమార్లు అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సురేష్ పేర్కొన్నారు. పండుగల సమయంలోనూ జీతాలు అందకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే సమ్మెను వేతన బకాయిలు చెల్లించే వరకు నిరవధికంగా కొనసాగిస్తామని సురేష్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగీ కృష్ణయ్య, ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నాయకులు నాగరాజ్, రాజేష్, అబ్దుల్ వహీద్‌తో పాటు కార్మికులు విజయలక్ష్మి, మన్నెమ్మ, అలివేలమ్మ, స్వాతి, శివలీల, పద్మ, భార్గవి, నీరజ, జయమ్మ, లక్ష్మి, మంగమ్మ, శ్రీలత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలు,హాస్టళ్లకు నిత్యావసర సరుకుల పంపిణీ టెండర్లను స్థానిక మహిళా సంఘాలకు ఇవ్వాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలు,ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే టెండర్లను స్థానిక మహిళా సంఘాలకు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడానికి ప్రభుత్వం పిలిచిన కేంద్రీకృత టెండర్లలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని లింగం గౌడ్ ఆరోపించారు. గత ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిన నాకాఫ్ ను మళ్లీ అదే సంస్థకు కాంట్రాక్టు కట్టపెట్టడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కమిషన్లు తీసుకొని అనుభవం లేని వారికి సబ్ కాంట్రాక్టులు ఇచ్చిందని అధికారులందరూ మామూళ్ల మత్తులో తూగుతున్నారని విమర్శించారు.

# ఎమ్మెల్యే సొంతూరిలో దళితులకు అవమానం!



**మహబూబ్ నగర్ (ఫ్లాష్ ఇండియా ప్రతినిధి) :**
వనపర్తి ఎమ్మెల్యే సొంత గ్రామమైన మంగంపల్లిలో దళితులను ఆలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారంటూ దళిత సంఘాల జేఏసీ, ఎం ఆర్ పి ఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షులు మల్లెపోగు శ్రీనివాస్ ఆరోపించారు. గ్రామంలో కుల వివక్షకు తావులేకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం 'చలో వనపర్తి' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ మల్లెపోగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాదిగలను కేవలం డప్పులు కొట్టేవారిగా, చెప్పులు కుట్టేవారిగా, ఎన్నికల సమయంలో ఓటర్లుగా మాత్రమే చూసే ధోరణి మారాలని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుల వివక్షను సహించేది లేదని స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా ఎస్పీ వెంటనే మంగంపల్లి గ్రామాన్ని సందర్శించి, ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం మంగంపల్లికి దళితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

# డిసెంబర్ నెలాఖరులోగా రీ సర్వే పూర్తి చేయాలి



**ములుగు,ఫ్లాష్ ఇండియా :** ములుగు జిల్లాలో రీ సర్వే నిర్వహణకు 19 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, మిగిలిన గ్రామాల్లో పనులను వేగవంతం చేసి డిసెంబర్ 2026 నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ఆదేశించారు. మంగళవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన రీ సర్వే బృందాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వే విధివిధానాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులు, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, బృందాల మధ్య సమన్వయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత రీ సర్వే కోసం 70 గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 21 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 49 గ్రామాల్లో పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు రెండేసి బృందాలు, మల్లంపల్లి మండలానికి ఒక బృందాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఒకేసారి రెండు గ్రామాల్లో రీ సర్వే పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాలన్నింటిలో సర్వే పూర్తయ్యే వరకు బృందాలు నిరంతరంగా పనిచేయాలని ఆదేశించారు. రీ సర్వే బృందాల్లోని రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, కార్యాలయ సహాయకులు, గ్రామ పాలన అధికారులు సమన్వయంతో తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. సంబంధిత తహసీల్దార్లు, మండల సర్వేయర్లు బృందాలకు అవసరమైన రెవెన్యూ రికార్డులు, సర్వే రికార్డులు, పటాలు, ఇతర సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి నమోదు పుస్తకాల తయారీ, రికార్డుల నమోదు, పత్రాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామాల వారీగా రీ సర్వే పురోగతిని పర్యవేక్షిస్తూ, మిగిలిన పనుల్లో వేగం పెంచి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్‌కుమార్, పర్యవేక్షకుడు మహేశ్, డివిజనల్ సర్వే పరిశీలకుడు సతీష్ చంద్ర, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, నాయబ్ తహసీల్దార్లు మల్లేశ్, నితీశ్, అన్ని మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ పరిశీలకులు, సీనియర్ సహాయకులు, కనిష్ఠ సహాయకులు, గ్రామ పాలన అధికారులు, సర్వేయర్లు, అనుమతి పొందిన సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎం చోరీల కట్టడికి పటిష్ట చర్యలు




**మెదక్ ,ఫ్లాష్ ఇండియా :** ఏటీఎం కేంద్రాల్లో గ్యాస్ కట్టర్లతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాల కదలికల నేపథ్యంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, సాంకేతిక సిబ్బందితో ఏటీఎం భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీఎంలలో సెన్సార్లు, అలారం వ్యవస్థలు చోరీల సమయంలో ఎందుకు అప్రమత్తం చేయడం లేదని సాంకేతిక సిబ్బందిని ప్రశ్నించారు. భద్రతా లోపాలను గుర్తించి వెంటనే సరి చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఆధునిక సెన్సార్లు, అలారాలు ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు. ఏటీఎం చోరీ ల నివారణకు పోలీసులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీ లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐ రాజశేఖర్ రెడ్డి, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

# ఆహారాన్ని వృధా చేయవద్దు..



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మిర్యాలగూడ గణేష్ నగర్ దుర్గా నవరాత్రుల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. భక్తులు తక్కువ రావడంతో సుమారు 100 కేజీల భోజనం మరియు కూరలు మిగిలాయి అని దుర్గా నగర్ మణి కి సమాచారం ఇవ్వగా,వారు వెంటనే పాతిమా ఎన్విరాన్మెంట్ డెవలప్మెంట్ సొసైటీ కి సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ ఫౌండర్ పర్వేజ్ వెంటనే మొహమ్మద్ రహమత్ టాటా ఏసీ వాహనంలో వెళ్లి భోజనాన్ని తీసుకువచ్చి జంగాల కాలనీలో అవసరం ఉన్నవారికి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కడి యువకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫర్వేజ్ మాట్లాడుతూ భోజనం వృధా కాకుండా ప్రత్యక్షంగా,పరోక్షంగా మాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదములు అని,ప్రతి ఒక్కరూ ఆహారాన్ని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు.




# శరవేగంగా కాప్రా అభివృద్ధి పనులు

**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా :**
కాప్రా సర్కిల్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులపై ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి దృష్టి సారించారు. మంగళవారం ఈసీఐఎల్, రాధిక జంక్షన్ల అభివృద్ధి, రహదారి విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూసేకరణ ప్రక్రియను

వేగవంతం చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. సోనీ సెంటర్ సమీపంలో రహదారి విస్తరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. పోచమ్మ జంక్షన్ (డీ-మార్ట్) వద్ద బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న పైపులైన్ల మార్పిడిని ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. చిన్న చెర్లపల్లి శ్మశానవాటిక అభివృద్ధిపై సంబంధిత అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.
ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనలో జాప్యం సహించబోమని స్పష్టం చేశారు.

# ఆటోలోకి లాక్కెళ్లి.. సెల్‌ఫోన్ దోపిడీ



**హిమాయత్ నగర్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రయాణికుడిని ఆటోలోకి లాక్కెళ్లి బెదిరించి, దాడి చేసి సెల్‌ఫోన్ దోపిడీ చేసిన ఇద్దరు నిందితులను నారాయణగూడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి దోపిడీకి గురైన ఒప్పో ఎఫ్25 ప్రో మొబైల్ ఫోన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ మట్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7న రాత్రి 11 గంటల సమయంలో బి. దిలేసు పాత్ర తన గదికి వెళ్తుండగా నారాయణగూడ ఫ్లైఓవర్ సమీపంలోని రివర్ షోరూమ్ ఎదురుగా ఓ ఆటో డ్రైవర్ అతడిని ఎక్కడికైనా వెళ్లాలా అని అడిగాడు. అతడు నిరాకరించడంతో బలవంతంగా ఆటోలోకి లాక్కెళ్లి, మరో వ్యక్తి సహాయంతో జేబులోని మొబైల్ ఫోన్‌ను లాక్కొని దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఈ నెల 12న చాదర్‌ఘాట్ సమీపంలో నిందితులను ఆటోతో సహా పట్టుకున్నారు. నిందితులను మహ్మద్ అమెర్ (28), మెరుగు మణిరాజ్ అలియాస్ మణి (23)గా గుర్తించారు. ఖైరతాబాద్ జోన్ డీసీపీ కె. శిల్పవల్లి మార్గదర్శకత్వంలో నారాయణగూడ పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. నిందితుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన క్రైమ్ సిబ్బందిని డీసీపీ అభినందించి బహుమతులు అందజేశారు.



# వెస్టిండీస్‌కు భారీ షాక్..

భారత్‌తో జరిగిన రెండో టీ20లో చారిత్రక విజయం సాధించిన వెస్టిండీస్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) షాక్ ఇచ్చింది. విండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్‌తో పాటు స్టార్ బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరినీ మందలించడంతో పాటు ఒక్కో డీమెరిట్ పాయింట్ విధించింది. అక్టోబర్ 9న రాంచీలో జరిగిన రెండో టీ20లో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనలపై ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది.రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. సంజు శాంసన్ 41 బంతుల్లో 82 పరుగులతో రాణించగా.. ఇషాన్ కిషన్ 22 బంతుల్లో 43 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 18 బంతుల్లో అజేయంగా 44 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ అద్భుతంగా ఆడింది. షై హోప్ 45 బంతుల్లో అజేయంగా 102 పరుగులు చేయగా.. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రొమారియో షెపర్డ్ 13 బంతుల్లో అజేయంగా 34 పరుగులు చేశాడు. దీంతో వెస్టిండీస్ 18.3 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసి.. ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది.వెస్టిండీస్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ ఔటయ్యాడు. మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో ఔటైన అనంతరం పావెల్ తన బ్యాట్‌తో బంతిని బాదాడు. ఈ చర్యను ఐసీసీ ప్రవర్తనా నియ-ామావళిలోని ఆర్టికల్ 2.2 ఉల్లంఘనగా పరిగణించింది. ఈ నిబంధన అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ పరికరాలు, దు-స్తులు లేదా మైదానంలోని ఇతర వస్తువులను దుర్వినియోగం చేయడానికి సంబంధించినది. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 13వ ఓవర్‌లో అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేశాడు. తన దృష్టిలో వైడ్‌గా భావించిన బంతిని అంపైర్ సరైన బంతిగా ప్రకటించడంతో అతడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఐసీసీ పేర్కొంది. ఈ ప్రవర్తనను ఆర్టికల్ 2.8 కింద అంపైర్ నిర్ణయంపై అసమ్మతి వ్యక్తం చేయడంగా పరిగణించింది.ఈ రెండు ఘటనలపై ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, రోహన్ పండిట్‌తో పాటు థర్డ్ అంపైర్ నితిన్ మీనన్, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మ ఫిర్యాదు చేశారు. మ్యాచ్ రిఫరీ ప్రకాశ్ భట్ ప్రతిపాదించిన చర్యలను పావెల్, రూథర్‌ఫోర్డ్ అంగీకరించారు. దీంతో అధికారిక విచారణ అవసరం లేకుండా పోయింది. ఇద్దరికీ అధికారిక మందలింపుతో పాటు ఒక్కో డీమెరిట్ పాయింట్ విధించారు. గత 24 నెలల్లో వీరికి ఇదే తొలి ఉల్లంఘనగా ఐసీసీ పేర్కొంది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. లెవల్-1 ఉల్లంఘనలకు అధికారిక మందలింపు, మ్యాచ్ ఫీజులో గరిష్ఠంగా 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉ ంటుంది.

# ఇది నిరంకుశత్వం



వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అద్భుతమైన టాలెంట్ ఉన్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితం కావడం క్రికెట్ వర్గాల్లో చర్చ-నీయాంశమైంది. ఈ నేపథ్యంలో వైభవ్ చిన్ననాటి కోచ్ మనీష్ ఓజా భారత జట్టు మేనేజ్‌మెంట్, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీమిండియాలో అరంగేట్రం చేసిన తర్వాత ఓపెనింగ్ స్లాట్ విషయంలో మేనేజ్‌మెంట్ నిలకడలేని నిర్ణయాలు తీసుకుంటోందని కోచ్ విమర్శించారు. అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేసే అవకాశం కోసం సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ పోటీ పడుతున్నారని, అయితే ఎవరికీ సరైన అవకాశాలు ఇవ్వడం లేదన్నారు. ఆసియా క్రీడలకు ముందు అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూను ఓపెనర్‌గా దించిన మేనేజ్‌మెంట్, ఆసియా గేమ్స్‌లో మాత్రం అతన్ని మూడో స్థానానికి మార్చి వైభవ్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించిందని గుర్తుచేశారు. ఆ తర్వాత వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో మళ్లీ మార్పులు చేసి తొలి మూడు టీ20ల్లో సంజూకు అవకాశం ఇచ్చి, వైభవ్‌ను మళ్లీ బెంచ్‌కే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైభవ్ ఒక తుఫాను లాంటివాడని, అతనితో పెట్టుకుంటే ఎవరైనా సరే దెబ్బతింటారని కోచ్ హెచ్చరించారు. ఆటగాళ్లను బెంచ్‌పై కూర్చోబెట్టడం ద్వారా మేనేజ్‌మెంట్ కొత్త తరపు ఆటగాళ్లను తయారుచేయగలమని భ్రమిస్తోందని ఎద్దేవా చేశారు. భవిష్యత్ తరాలను తయారు చేయాలంటే యువ ఆటగాళ్లను కఠినమైన పరిస్థితుల్లోకి పంపి ఆడించాలని, బెంచ్‌పై కూర్చోబెడితే ఏ ఆటగాడూ ఎదగలేడని దిగ్గజాలు కూడా చెబుతున్నారని గుర్తుచేశారు. ఇంతటి అద్భుతమైన ప్రతిభ ఉన్న వైభవ్‌ను పక్కన పెట్టడం సరికాదన్నారు. ప్రస్తుత భారత టీమ్ మేనే-జ్‌మెంట్ వ్యవహారశైలిని ఆయన ఏకంగా 'నిరంకుశత్వం' (డిక్టేటర్‌షిప్) అంటూ విమర్శించారు. వైభవ్‌కు అసలు అవకాశమే ఇవ్వకూడదని మేనేజ్‌మెంట్ ముందుగానే ఫిక్స్ అయిందేమోనని, ఆటగాడిని మానసికంగా విసిగించి నీళ్లు మోయించే పనులు చేస్తున్నారని ఆరోపించారు.



# తెలుగు ఆటగాడిపై మాజీ క్రికెటర్ ఫైర్!

వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ ఔటైన తీరు చర్చనీయాంశంగా మారింది. ఆటపై అవగాహన లేకపోవడంతోనే అతడు వికెట్ కోల్పోయాడని భారత మాజీ ఓపెనర్ సదగోప్పన్ రమేశ్ విమర్శించాడు. కీలక సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన తిలక్.. చుట్టూ ఏం జరుగుతుందో కూడా పట్టించుకోనట్లు వ్యవహరించాడని ఫైర్ అయ్యాడు. తిలక్ ఆట తీరును బీచ్‌లో వాకింగ్ చేస్తున్న వ్యక్తితో పోల్చాడు. అంత నిర్లక్ష్యం ఏంటి?, బీచ్‌లో వాకింగ్ చేస్తున్నావా ఏంటి? అంటూ రమేశ్ మండిపడ్డాడు.ఆదివారం రాత్రి ఇండోర్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య మూడో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో తిలక్ వర్మ అనూహ్య రీతిలో అవుట్ అయ్యాడు. విండీస్ బౌలర్ గుడాకేశ్ మోటీ వేసిన బంతిని అక్షర్ పటేల్ స్క్వేర్ లెగ్ దిశగా ఫ్లిక్ చేశాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న కమీల్ పూరన్ డైవ్ చేస్తూ బంతిని అడ్డుకున్నాడు. అయితే బంతి బౌండరీ రోప్‌ను తాకిందని అక్షర్ , తిలక్ వర్మ భావించారు. దీంతో పరుగులు పూర్తి చేయడంపై తిలక్ దృష్టి పెట్టలేదు. ఈ అవకాశాన్ని వెస్టిండీస్ ఫీల్డర్లు చక్కగా ఉపయోగించుకున్నారు. బంతి బౌ ండరీకి వెళ్లలేదని గుర్తించిన వారు వెంటనే స్పందించి రెండు వైపులా వికెట్లను పడగొట్టారు.అయితే అప్పటికే అక్షర్ పటేల్ స్ట్రైకర్ ఎండ్‌కు చేరుకోగలిగాడు. కానీ నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉ న్న తిలక్ వర్మ మాత్రం క్రీజులోకి చేరుకునే ప్రయత్నం చేయలేదు. బౌలర్ మోటీ వికెట్లపై ఉన్న బెయిల్స్‌ను పడగొట్టడంతో.. తిలక్ రనౌట్ అయ్యాడు. తిలక్ ఔటైనట్లు థర్డ్ అంపైర్ ప్రకటించాడు. ఈ ఘటనపై స్పందించిన సదగోప్పన్ రమేశ్.. 'బౌండరీ వద్ద ఏం జరిగిందో అంపైర్లకే స్పష్టత లేక థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేశారు. అలాంటప్పుడు అంతే దూరంలో ఉన్న బ్యాటర్లు బంతి బౌండరీకి వెళ్లిందని ఎలా నిర్ణయించుకున్నారు. అక్షర్ పటేల్ తర్వాత పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. కానీ తిలక్ మాత్రం చుట్టూ ఏం జరుగుతుందో తెలియనట్లుగా వ్యవహరించాడు. అతడు బీచ్‌లో నడకకు వెళ్లినట్లుగా కనిపించాడు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎప్పుడైనా బ్యాటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించాడు.ఈ మ్యాచ్‌లో భారత్ 14 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లోనే 69 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఇషాన్ కిషన్ 18 బంతుల్లో 37 పరుగులు చేయగా, తిలక్ వర్మ 16 బంతుల్లో 28 పరుగులు చేశాడు. నితీశ్ కుమార్ రెడ్డి 21, అక్షర్ పటేల్ 20 పరుగులతో రాణించారు. 224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 209 పరుగులకే పరిమితమైంది. షిమ్రోన్ హెట్‌మయర్ 43, కమీల్ పూరన్ 42 పరుగులతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 44 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# బిజినెస్

# భారత వృద్ధి రేటు 7 శాతం..



భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన వేగంతో ముందుకు సాగుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తన తాజా 'వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్' నివేదికలో స్పష్టం చేసింది. 2026- 2027 ఆర్థిక సంవత్సరాల్లో భారత జీడీపీ వృద్ధి రేటు స్థిరంగా 7.0 శాతంగా నమోదవుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. బలమైన దేశీయ డిమాండ్, సేవల రంగం విస్తరణ, నిర్మాణాత్మక సంస్కరణలు భారత ఆర్థిక పురోగతికి ఊతమిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, అంతర్జాతీయంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకోనుందని సంస్థ అభిప్రాయపడింది.మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిలకడగానే ఉన్నప్పటికీ, ఆ నిలకడ క్రమంగా బలహీనపడుతూ అసమానతలకు దారితీస్తోందని పేర్కొంది. ప్రపంచ వృద్ధి రేటు 2026 లో 3.1 శాతంగా, 2027 లో 3.4 శాతంగా మాత్రమే నమోదు కావచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా ఇంధన, ఆహార ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం 4.7 శాతానికి చేరుకునే ప్రమాదం ఉందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. అంతర్జాతీయ స్థాయిలో అనిశ్చితి, పెరుగుతున్న చమురు ధరల రిస్క్ పొంచి ఉన్నప్పటికీ భారత వృద్ధి రేటు 7 శాతంగా అంచనా వేయడం భారత మార్కెట్లకు, పెట్టుబడిదారులకు పెద్ద ఊరటనిచ్చినట్లయింది.



# ధరలు పెంచిన వోల్వో కార్స్ ఇండియా

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ముడిసరుకులతో పాటు షిప్పింగ్, లాజిస్టిక్స్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఈ కారణంగా తమ లగ్జరీ కార్ల ధరలను పెంచడం అనివార్యమని వోల్వో కార్స్ ఇండియా తెలిపింది. తమ ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ వెహికల్ ఈఎక్స్90 లాంచ్ సందర్భంగా వోల్వో కార్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి మల్హోత్రా మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా సరుకుల రవాణా డెలివరీ సమయం పెరగడంతో పాటు షిప్పింగ్ ఖర్చులు పెరిగాయని, ఈ అదనపు ఉత్పత్తి వ్యయాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగదారులకు బదిలీ చేయక తప్పట్లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశీయంగా తమ మొత్తం విక్రయాల్లో నాలుగో వంతు వాటా ఎలక్ట్రిక్ వాహనాల నుంచే వస్తోంది. ఇకపై ప్రతి సంవత్సరం భారత మార్కెట్లోకి ఒక కొత్త ఎలక్ట్రిక్ కారును విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న రెండు ఈవీలతో పాటు త్వరలోనే ఎస్‌యూవీ ఈఎస్90, సెడాన్ ఈఎస్90 మోడల్ కార్లను అందుబాటులోకి తీసుకొస్తామని, అదే సమ-యంలో సాంప్రదాయ ఇంధన వాహనాల మైల్డ్ హైబ్రిడ్ వెర్షన్లను కూడా కస్టమర్లకు అందుబాటులో ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# జియో మొత్తం ముకేశ్ అంబానీది కాదా?




భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని సరికొత్త రికార్డుకు రంగం సిద్ధమైంది. దేశంలోనే అతిపెద్ద ఐపీవోగా జియో ప్లాట్‌ఫామ్స్ దలాల్ స్ట్రీట్‌లోకి అడుగుపెట్టేందుకు ముహూర్తం ఖరారైంది. దాదాపు రూ.37,700 కోట్ల భారీ నిధుల సమీకరణే లక్ష్యంగా రాబోతున్న ఈ మెగా ఇష్యూ కోసం మదుపరులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే మార్కెట్లను ఊపేస్తున్న ఈ భారీ ఐపీవో వేళ ఒక బయటపడ్డ షాకింగ్ నిజాలు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు దేశమంతా జియో అంటే కేవలం ముకేశ్ అంబానీ సొంత సామ్రాజ్యం అనుకుంటోంది. కానీ మార్కెట్ రెగ్యులేటర్‌కు సమర్పించిన ముసాయిదా పత్రాలు మాత్రం పూర్తి భిన్నమైన నిజాన్ని బయటపెట్టాయి.

**అంబానీ వాటా 100% కాదు.. కేవలం**

జియో ప్లాట్‌ఫామ్స్‌పై రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు పూర్తి యాజమాన్య హక్కులు లేవన్నదే ఇప్పుడు ట్రేడింగ్ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ నివేదికల ప్రకారం.. జియోలో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా కేవలం 66.43 శాతం మాత్రమే. మిగిలిన 33 శాతానికి పైగా భారీ వాటాను ప్రపంచ టెక్ దిగ్గజాలు, అంతర్జాతీయ సావరిన్ వెల్త్ ఫండ్‌లు చేజిక్కించుకున్నాయి. మొత్తం 105 మంది వాటాదారుల పెట్టుబడులతో జియో నడుస్తోంది. ముకేశ్ అంబానీ కేవలం టెలికాం ఆపరేటర్‌గా కాకుండా, అంతర్జాతీయ స్థాయి డిజిటల్ పవర్‌హౌస్‌గా జియోను తీర్చిదిద్దడం వల్లే ప్రపంచ స్థాయి కార్పొరేట్ శక్తులు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. రిలయన్స్ తర్వాత జియోలో రెండో అతిపెద్ద వాటాదారుగా సోషల్ మీడియా దిగ్గజం మెటా (ఫేస్‌బుక్) అనుబంధ సంస్థ 'జాదూ హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ' నిలిచింది. దీనికి ఏకంగా 9.98 శాతం వాటా ఉంది. మరో టెక్ దిగ్గజం గూగుల్ ఇంటర్నేషనల్ ఎల్ఎల్‌సీ 7.73 శాతం వాటాతో మూడో స్థానంలో ఉ ంది. వీటితో పాటు సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ 2.31 శాతం, కేకేఆర్ అనుబంధ సంస్థ ఒమిక్రాన్ ఏషియా హోల్డింగ్స్ 2.31 శాతం, విస్టా ఈక్విటీ పార్ట్‌నర్స్ 2.31 శాతం చొప్పున వాటాలను కలిగి ఉన్నాయి. సిల్వర్ లేక్, ముబాదలా, జనరల్ అట్లాంటిక్ వంటి మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు సైతం జియోలో కీలక భాగస్వాములుగా ఉండటం అంతర్జాతీయ స్థాయిలో జియో బలాన్ని చాటుతోంది.ఈ మెగా ఇష్యూలో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. ఇందులో ఎలాంటి 'ఆఫర్ ఫర్ సేల్' భాగం లేదు. సాధారణంగా ఐపీవో వచ్చిందంటే పాత ఇన్వెస్టర్లు తమ వాటాలను అమ్ముకుని లాభాలతో బయటపడటం ఆనవాయితీ. కానీ జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న ఏ ఒక్క పాత ఇన్వెస్టర్ కూడా తమ వాటాలను విక్రయించడం లేదు. కంపెనీ భవిష్యత్తు, డిజిటల్ విస్తరణపై గ్లోబల్ దిగ్గజాలకు ఉన్న తిరుగులేని నమ్మకానికి ఇది నిదర్శనం. కంపెనీ మార్కెట్ నుంచి సమీకరించే రూ.37,700 కోట్ల మొత్తాన్ని 27 కోట్ల సరికొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారానే సేకరించనుంది. ఒక్కో షేరు ప్రైస్ బ్యాండ్ దాదాపు రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. సెబీ వద్ద తుది పత్రాల దాఖలు అనంతరం, అక్టోబర్ మూడో వారం నాటికి సబ్‌స్క్రిప్షన్ తేదీలు అధికారికంగా ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అంబానీ టెక్నాలజీ విజన్, గ్లోబల్ ఇన్వెస్టర్ల అండతో వస్తున్న ఈ భారత మార్కెట్ హిస్టారికల్ ఐపీవో ఇంకెన్ని సరికొత్త రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

# బంగారం ధరలు.. సీన్ రిపీట్..



దేశంలో బంగారం ధరల పతనం కొనసాగుతోంది. డాలర్ బలపడటంతో పసిడి ధరలు తగ్గుతున్నాయి. నిన్న ఓ మో-స్తరు స్థాయిలో తగ్గిన ధరలు నేడు ( అక్టోబర్ 13) కూడా తిరోగమనంలో పయనిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.350 మేర తగ్గి రూ.1,49,290కు చేరుకుంది. 22 క్యారెట్ల ధర కూడా రూ.350 మేర తగ్గి రూ.1,36,850కు దిగింది. వెండి ధర రూ.2.45 లక్షల వద్ద కొనసాగుతోంది.

# విజయ్ సేతుపతి ట్రైన్ రిలీజ్ డేట్ ఫిక్స్..




తెలుగు, తమిళం అని తేడా లేకుండా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఈ హీరో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు చేస్తుండగా.. వాటిలో 'ట్రైన్' ఒకటి. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ మిస్కిన్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ డ్రామా నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా మరో సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ ఓ సరికొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ప్రయాణానికి సిద్ధమవ్వండి! ట్రైన్ ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలోకి దూసుకురానుంది!' అంటూ ప్రకటించారు. కాగా.. వీ క్రియేషన్స్ బ్యానర్‌పై కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్న ఈ మూవీలో శృతి హాసన్, నాజర్, దివ్య శర్మ, జయరామ్, వినయ్ రాయ్, నరైన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక దర్శకుడు మిస్కిన్ స్వయంగా ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం విశేషం. కదిలే రైలులో ఆయుధాలతో ఉన్న వ్యక్తులతో ఒక వ్యక్తి పోరాడి బందీలను రక్షించే యాక్షన్ డార్క్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రాబోతుండగా.. ప్రేక్షకులతో పాటు విజయ్ సేతుపతి ఫ్యాన్స్‌లో కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

## ఈ సినిమా నాకు అత్యుత్తమమైనది..

Sobhita Dhulipala



ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ దర్శకత్వంలో వస్తోన్న తమిళ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామా 'వెట్టువం'. ఆర్య, దినేష్‌తో పాటు టాలీవుడ్ బ్యూటీ శోభితా ధూళిపాళ ఇందులో కీలక పాత్రలో నటిస్తుంది. ఈ సినిమాలో శోభిత 'రథి' అనే పాత్ర కోసం మల్లఖంబం, కలరిపయట్టు వంటి సంప్రదాయ యుద్ధ కళల్లో కఠినమైన శిక్షణ కూడా తీసుకుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు వెట్టువం సినిమా గురించి చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.'ఈ సినిమా కోసం నేను నా సర్వస్వాన్ని నింపేశాను.. గతంలో కంటే చాలా ఎక్కువగా ఇదొక అత్యుత్తమమైనదని నేను భావిస్తున్నాను. అంటే మిగిలిన సినిమాలను తక్కువ చేస్తున్నా అని కాదు.. అద్భుతమైన పా. రంజిత్‌తో కలిసి పనిచేయడం కూడా ఒక కారణం. విషయం ఏమిటంటే, 'మేడ్ ఇన్ హెవెన్' నుండి, ఆ తర్వాత కొద్ది కాలం నేను ఒకే రకమైన పాత్రలను పోషిస్తున్నానని నాకు అనిపించి. అయితే.. ఈ సినిమాలో నా పాత్ర పూర్తిగా భిన్నంగా ఉంటుంది. పైకి కనిపించని, లోపల చాలా విషయాలు దాగి ఉన్న, ఉక్కులాంటి వెన్నెముక కలిగిన ఒక మహిళ పాత్ర ఇది. పైకి ఒక సౌందర్యం కనిపిస్తూ, లోపల నీటి అడుగున చాలా విషయాలు జరుగుతుంటాయి. అలాంటిదే ఈ పాత్ర కూడా. అలాంటి స్వేచ్ఛాయుతమైన వ్యక్తిత్వం గల పాత్రను పోషించడం నాకు లభించిన ఒక అద్భుతమైన అవకాశంగా భావిస్తున్నా. ఈ ఆనందాన్ని నేను మాటల్లో మాత్రం వర్ణించలేను' అని చెప్పుకొచ్చింది.

## అందుకే 'వారణాసి'




దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబోలో రాబోతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. ఈ ప్రాజెక్ట్‌పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రాజమౌళి ఈ సినిమాకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడిస్తూ, 'వారణాసి' తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రమని స్పష్టం చేశారు. చాలా కాలంగా ఒక పూర్తిస్థాయి అడ్వెంచర్ సినిమా తీయాలని భావిస్తున్నానని, ఆ కల ఇప్పుడు ఈ మూవీ ద్వారా నెరవేరుతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తన సినిమాలన్నింటికీ రామాయణం, మహాభారతం ఇతిహాసాలే ప్రధాన స్ఫూర్తి అని తెలిపారు. అయితే 'వారణాసి' చిత్రంలో నేరుగా రామాయణానికి సంబంధించిన ఒక పవర్‌ఫుల్ ఘట్టం ఉంటుందని, కానీ అది సినిమాలో ఒక చిన్న భాగం మాత్రమేనని క్లారిటీ ఇచ్చారు.ఆ ఒక్క ఎపిసోడ్ మాత్రమే కాకుండా, ఇందులో చూపించబోయే విషయాలు ప్రేక్షకులు ఊహించని స్థాయిలో ఉంటాయని చెప్పారు. గతంలో రామాయణ, మహాభారతాల ఆధారంగా వచ్చిన అనేక పౌరాణిక చిత్రాలను చూశానని, వాటిలో కొన్ని గొప్ప సన్నివేశాలు నచ్చినప్పటికీ, ఏ సినిమా కూడా తనను పూర్తిగా సంతృప్తిపరచలేదని ఆయన ఓపెన్‌గా చెప్పారు. ఆ ఇతిహాసాలకున్న గొప్పతనానికి, వైభవానికి తగ్గ స్థాయిలో విజువల్స్ తెరపైకి రాలేదని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వాటిని మరింత భారీ స్థాయిలో, గొప్ప విజువల్స్, ఎమోషన్స్‌తో చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్నాళ్లూ ఆ సినిమాలను చూసి సంతృప్తి చెందలేదు కాబట్టి, ఇప్పుడు ఆ స్థాయి వైభవాన్ని తెరపై చూపించాల్సిన బాధ్యత తనపైనే ఉందని అన్నారు. రామాయణాన్ని తాను ఎలా చూడాలనుకున్నారో అలాగే 'వారణాసి'ని ఆవిష్కరించడమే తన ముందున్న అతిపెద్ద సవాలు అని రాజమౌళి పేర్కొన్నారు.




## హైందవ టీజర్ రాబోతున్నది

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'హైందవ'. దర్శకుడు లుధీర్ బైరెడ్డి తెరకెక్కిస్తున్న ఈ మూవీ నుంచి తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌కు ముహూర్తం ఫిక్స్ చేస్తూ.. 'కోపానికి ఒక కొత్త రూపం వచ్చింది. రక్త దాహం పెరుగుతోంది.. శక్తివంతమైన హైందవ టీజర్ అక్టోబర్ 14న రానుంది' అంటూ ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను షేర్ చేశారు. కాగా.. 400 ఏళ్లనాటి ఆలయం నేపథ్యంలో సాగే ఈ పౌరాణిక యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌కు లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.

## రొమాంటిక్ డ్రామాతో రాబోతున్న సుహాస్..




టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ హీరో సుహాస్ వరుస పెట్టి వైవిధ్యమైన కథలతో దూసుకుపోతున్నారు. ఇటీవల తమిళ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'తో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న సుహాస్.. తాజాగా, రొమాంటిక్ డ్రామాతో రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించి అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించారు. ఈ సినిమాకు 'హైడ్ & సిల్క్' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, మేకర్స్ ఒక చిన్న గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో సుహాస్ మగ్గంపై చీర నేస్తూ కనిపించడం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. వీడియో వెనకాల సీనియర్ నటుడు తనికెళ్ల భరణి వాయిస్ ఓవర్ ఇస్తూ.. 'ప్రతి చీర ఒక ప్రత్యేకమైన మహిళ కోసమే పుడుతుంది' అనే డైలాగ్ చెబుతారు.ఇక ధారాల మధ్యే సుహాస్-సంజన ప్రేమ చిగురించిందని తెలుపుతూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకర్షిస్తోంది. ఇక ఈ సినిమాలో సుహాస్ సరసన లబ్బర్ పందు, డీసీ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సంజన కృష్ణమూర్తి హీరోయిన్‌గా నటిస్తుండగా.. తనికెళ్ల భరణి, నందు కీలక పాత్రలో కనిపించనున్నారు. కోలీవుడ్‌లో ఎన్నో మంచి సినిమాలు తీసిన ప్రముఖ నిర్మాణ సంస్థ 'స్టోన్ బెంచ్ స్టూడియోస్', తెలుగులో నాలుగు సినిమాలు చేయడానికి ప్లాన్ చేస్తోంది. అందులో మొదటి ప్రాజెక్ట్‌గా రాబోతున్న 'హైడ్ ఽ సిల్క్'ను వర్తికా జైన్‌కు చెందిన 'మిశ్రిలాల్ పిక్చర్స్'తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో రాజేంద్ర బాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇక ఈ సినిమా తెలుగు, తమిళంలో త్వరలోనే విడుదల కాబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.

## ఒక కల నిజమైనట్లు అనిపించింది

పలు చిత్రాల్లో నటించి ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న యంగ్ బ్యూటీ అనన్య పాండే తాజాగా మరో అరుదైన బాధ్యతను అందుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈ భామ, రాబోయే ప్రతిష్టాత్మక IIFA అవార్డ్స్ 2027 వేడుకకు సహ-హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. నటిగా తనదైన అందం, అభినయంతో అభిమానులకు సంపాదించుకున్న ఆమె, ఇప్పుడు తొలిసారి యాంకర్‌గా అవార్డుల వేదికను హోస్ట్ చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా IIFAతో తనకున్నఅనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అనన్య ఎమోషనల్ కామెంట్స్ చేశారు. ఐఫా వేడుకలో భాగం కావడం తనకెప్పుడూ ఎంతో ప్రత్యేకమని అనన్య అన్నారు. అబుదాబిలోని యాస్ ఐలాండ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక వేదికపైనే తాను మొదటిసారి స్టేజ్ పెర్ఫార్మన్స్ ఇచ్చానని, ఆ క్షణంలో కలిగిన ఉత్సాహం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే ఉందని ఆమె గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఐఫా అవార్డ్సును టీవీల్లో చూస్తూ పెరిగిన తనకు, భారతీయ సినిమాకు సంబంధించిన ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించిందని తెలిపారు.కాలక్రమేణా ఐఫా తన సినీ ప్రయాణంలో ఒక అందమైన భాగంగా మారిపోయిందని చెప్పారు. ఇలాంటి ప్రతి వేడుక ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని, కెరీర్‌లో మరింతగా ఎదగడానికి, తనలోని సరికొత్త నైపుణ్యాలను బయటపెట్టుకోవడానికి మంచి అవకాశాలు దక్కాయని అనన్య వెల్లడించారు. ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకునే అవకాశం ఐఫా ద్వారానే కలిగిందని తెలిపారు. ఐఫా వేదికపై ఉండే జోష్, అక్కడి వాతావరణం, ప్రేక్షకుల అరుపులు, అలాగే మన సినిమా ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది ప్రముఖులంతా ఒకేచోట చేరి చేసే సందడిలో నిజంగానే ఒక ప్రత్యేకమైన మ్యాజిక్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఏకంగా ఐఫా అవార్డ్సుకు సహ-హోస్ట్‌గా ఒక సరికొత్త బాధ్యతతో ఐఫా 2027 వేదికపైకి వస్తుండటం తనకెంతో సంతోషాన్నిస్తోందని అనన్య అన్నారు. మళ్లీ అదే వేదికపైకి వెళ్లి, మన దేశంలోని గొప్ప నటులు, అద్భుతమైన కథలు, విజయాలను అందరితో కలిసి వేడుకలా సెలబ్రేట్ చేసుకునే అవకాశం రావడం తనలో ఉత్సాహాన్ని నింపుతోందని చెప్పారు.



Anupama Parameswaran

## బ్రేకప్ అంటే బాధ కాదు..

మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమాయణం, బ్రేకప్ గురించి మరోసారి స్పందిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షించారు. కొద్ది రోజుల క్రితమే తన మాజీ ప్రియుడు ఎంతో విచిత్రంగా ప్రవర్తించేవాడని, తన వ్యక్తిగత విషయాలతో పాటు సినిమా కెరీర్‌ను కూడా కంట్రోల్ చేయడానికి ప్రయత్నించాడని చెబుతూ సంచలనం సృష్టించారు. తాజాగా, మరోసారి తన బ్రేకప్‌ను గుర్తు చేసుకుంటూ, జీవితంలో ఎదురైన ఆ చేదు అనుభవం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జీవితంలో ప్రేమ ఎంత అందంగా ఉంటుందో, ఇద్దరు వ్యక్తులు విడిపోవడం కూడా అంతే అందమైన విషయమని అనుపమ అభిప్రాయపడ్డారు.ఒక పార్ట్‌నర్‌తో విడిపోవడం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక సహజమైన భాగమేనని ఆమె పేర్కొన్నారు. ఒక బంధం ముగిసిన తర్వాత ఆ వ్యక్తి నుంచి మనం ఎలా దూరమవుతామో, ఆ తర్వాత రోజుల్లో మనల్ని మనం ఎలా మెరుగుపరుచుకుని ఒక మంచి వ్యక్తిగా ఎదుగుతామో అనేది కేవలం ఆ విడిపోవడంతోనే మొదలవుతుందని ఆమె వెల్లడించారు. అందుకే తన కోణంలో చూస్తే బ్రేకప్ అనేది బాధ కాదని.. అది ఎంతో అందంగానే కనిపిస్తుందని స్పష్టం చేశారు. ప్రేమలో విఫలమైనప్పటికీ ధైర్యంగా నిలబడి, తన జీవితాన్ని మరింత అందంగా మలుచుకుంటున్న అనుపమ తీరును చూసి నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.



Ananya Panday

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**